క్లుప్తంగా

అడిషనల్ కలెక్టర్ బదిలీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎనుగు నర్సింహారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన ఇటీవల జిల్లాకు వచ్చారు. అతి త్వరగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇప్పటి దాకా ప్రభుత్వం ఎవరిని నియమించలేదు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



గండేడ్: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సల్కర్‌పేట్ మినీగురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనం పరిశీలించారు. సమయపాలన పాటిస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్, ప్రిన్సిపాల్ రజిని పాల్గొన్నారు.

బాబురావు, వెంకట్రావును సస్పెండ్ చేయాలి

జడ్చర్ల టౌన్: గిరిజన తెగల మధ్య చిచ్చురేపుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని మోసపూరిత కుట్ర పన్నుతున్న కాంగ్రెస్ నాయకులు సోయం బాబురావు, తెల్లం వెంకటరావులను వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవికి వినతిపత్రం సమర్పించారు. వారిద్దరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్, జీవీఎస్ నాయకులు లోకేష్‌నాయక్, శంకర్‌నాయక్, శ్రీనునాయక్, పాండునాయక్, నారాయణ, శ్రీకాంత్, మేఘావత్ రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది

రాజాపూర్: పది మందికి అక్షరాలు నేర్పి వారి విద్యాభివృద్ధికి మూలకారణం ఉపాధ్యాయులేనని నాటి దేశప్రధాని, రాష్ట్రపతితో పాటు ఎంతోమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యారంటే అందుకు మూలకారణం ఉపాధ్యాయుడేనని బాలానగర్ మండల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్ అన్నారు. బుధవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రంజిత్‌కుమార్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్కర్ల వేతనాలు చెల్లించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ కాలేజీ హాస్టల్ వర్కర్స్‌కు ఇవ్వాల్సి 6 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కేవీపీఎస్ నాయకుడు మాణిక్యంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 6 కాలేజీ హాస్టళ్లలో 42 మంది వర్కర్లు పని చేస్తున్నట్లు తెలిపారు. వారికి ఆరు నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణ భారమైందన్నారు. హాస్టల్ వర్కర్స్‌కు దసరా పండగలోపు జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కురుమయ్య, పట్టణ కార్యదర్శి విష్ణు, నాయకులు మనోహర్, రవికుమార్ పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హిస్టరీ, కామర్స్, బోటనీ, తెలుగు, స్టాటస్టిక్స్, కంప్యూటర్‌సైన్స్ వంటి కోర్సుల్లో ఖాళీలున్నాయని, పీజీతో పాటు, నెట్, సెట్ వంటి అర్హతలున్న వారు ఈనెల 19లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూలు ఈనెల 20న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మనగ్రోమోర్ లైసెన్స్ సస్పెండ్

నవాబుపేట: యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారన్న విషయంలో మండల కేంద్రంలోని మనగ్రోమోర్ ఎరువుల దుకాణం లైసెన్స్‌ను సస్పెండ్ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడ్డారని మండలంలోని లింగంపల్లికి చెందిన రైతు రవీందర్‌రెడ్డి సంబంధిత అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. 90 మందికి వ్యవసాయ అధికారులు ఎలాంటి టోకెన్లు ఇవ్వకున్న వారికి అక్రమంగా రాత్రి వేల యూరియాను అందించారని ఆరోపించాడు. దీంతో విచారణ చేసి పూర్తి వివరాలు జిల్లా అధికారులకు అందించారు. విచారణలో యూరియా పంపిణీలో అవకతవకలు జరిగినట్లు మండల బస్తాల తేడా వచ్చిందని అధికారులు వివరించారు. దీంతో బుధవారం రాత్రి సంబంధిత ఎరువుల దుకాణం లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందించినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపాడు.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వద్ద జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో జనరల్ ఆస్పత్రిలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు



జడ్చర్లలో మార్కెట్ యార్డులో ప్రజాపాలన దినోత్సవం పతాకావిష్కరణ కార్యక్రమం

జాతీయ పతాకం రెపరెపలు

- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై..
- పాఠశాలలు, పార్టీ కార్యాలయాలపై..

సాక్షి, నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీతో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ మండలంలోని గ్రామాలలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కరుణశ్రీ,, తహసీల్దార్ ఘన్సీరామ్, రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులు వారి కార్యాలయాలపై జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి జాతీయ పతాకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈఓ డి.పురుషోత్తం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- పీయూలో..: పీయూలో అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద జాతీయ జెండాను రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమార స్వామి మాట్లాడారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్స్ లా కళాశాల మాళవి, కరుణాకర్‌రెడ్డి, చీఫ్ వార్డెన్ కృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.
- జనరల్ ఆస్పత్రిలో..: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా జాతీయ జెండా ఆవిష్కరించారు.
- దేవరకద్ర తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, మండల వనరులు, మహిళా సమాఖ్య, సబ్ ట్రెజరీ, మున్సిపల్, మిషన్ కాకతీయ, విద్యుత్ ఏడీఏ, మార్కెట్ యార్డు కార్యాలయాలపై జాతీయ పతాకాలను ఎగుర వేశారు.



మిడ్జిల్ ఎంపీడీఓ కార్యాలయంపై..



అప్పంపలి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు

- చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలం అప్పంపల్లిలో అమర వీరుల స్తూపం వద్ద గ్రామస్తులు నివాళులర్పించారు. జెండాను ఆవిష్కరించారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలోని తాహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ, గ్రామ పంచాయతీ కార్యాలయాలపై జాతీయ జెండాలు ఎగరవేశారు.
- నవాబుపేటలో తహసీల్దార్, ఎంపీడీఓ, వివిధ గ్రామాల పంచాయతీలపై, రైతు వేదికల వద్ద జాతీయ జెండాలు ఆవిష్కరించారు.
- మిడ్జిల్ మండలంలో తహసీల్దార్ రాజు, గీతాంజలి, ఏఓ సిద్ధార్థ వారి కార్యాలయాలపై జాతీయ జెండాలు ఆవిష్కరించారు.
- రాజాపూర్, బాలానగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ రాధాకృష్ణ, బాలానగర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిలు జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్‌స్టేషన్, రైతువేదిక వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు.
- గండేడ్ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేశారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగర వేశారు.

ప్రజాపాలనలో అన్ని వర్గాల సంక్షేమం

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1947 ఆగస్టు 17న దేశానికి స్వాతంత్య్రం వచ్చినా నిజాం పాలనలో మగ్గుతున్న సందర్భంలో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో సైనిక చర్య జరిపి తెలంగాణ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ స్వేచ్ఛ స్వాతంత్య్రం ప్రసాదించిందన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, నాయకులు సంజీవ్ ముదిరాజ్, జహీర్ అఖ్తర్, చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ.వెంకటేశ్, సీజే బెనహర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సిరిసంపదలు కలగాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరికి ఆనందం, అభివృద్ధి, సిరిసంపదలు కలగాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మోనప్పగుట్టలోని మౌనేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, యాగశాలలో జరిగిన యజ్ఞంలో పాల్గొన్నారు.

కార్మిక వర్గాల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

కార్మిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలో విశ్వకర్మ మహర్షి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిల్పులు, కార్మికులు సమాజానికి పునాది లాంటి వారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, స్వర్ణకారుల సంఘం నాయకులు సత్యనారాయణ చారి, రాజేశ్, జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

⇨ నవాబుపేట మండల విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహచారి, విశ్వకర్మల సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

⇨ చిన్నచింతకుంట మండల కేంద్రంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వకర్మ కమిటీ సభ్యులు సుదర్శనాచారి, భాస్కరాచారి, శ్రీనివాసులు చారి, విష్ణుచారి, బానుమూర్తి, వేణుచారి, మోనాచారి ఉన్నారు.

⇨ దేవరకద్రలో సమీపంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద పలువురు విశ్వకర్మ సంఘం నాయకులు పతాకావిష్కరణ చేశారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

⇨ మిడ్జిల్ మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల విశ్వకర్మ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మహబూబ్‌నగర్‌లో యాగశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న విశ్వకర్మ బంధువులు



చిన్నచింతకుంటలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించిన విశ్వకర్మ కమిటీ నాయకులు



దేవరకద్రలో పూజలు చేస్తున్న విశ్వకర్మలు

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం



దేవరకద్రలో జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న బీజేపీ నాయకులు



మహమ్మదాబాద్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని పాత బస్టాండ్‌లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

⇨ దేశ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

⇨ మహమ్మదాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు మూస నర్సింహులు ఆధ్వర్యంలో దేశాయిపల్లిగేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

⇨ జడ్చర్ల పట్టణంలో సిగ్నల్‌గడ్డలో బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో 75మంది రక్తదానం చేశారు. సత్యేశ్వర ఆశ్రమంలో అన్నదానం చేశారు. సరస్వతి శిశుమందిరంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

⇨ జడ్చర్ల పట్టణంలో ఏబీవీపీ, బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించగా, కాంగ్రెస్, ప్రభుత్వ అధికారులు ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మార్కెట్‌యార్డులో చైర్ పర్సన్ జ్యోతి, మున్సిపాలిటీ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ పుష్పలత పతాకావిష్కరణ చేశారు.

⇨ రాజాపూర్(బాలానగర్) మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థనారిసశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రధాన మంత్రి మాతృవందన పథకాన్ని ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.

⇨ మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రపంచ నేతగా ప్రధాని నరేంద్రమోదీ



నవాబుపేటలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ డీకే అరుణ

నవాబుపేట: ప్రపంచంలో గొప్ప నేతగా మోదీ ఎదిగారని, ఆయన హయాంలో భారతదేశం అగ్రగామిగా నిలిచిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని మండల కేంద్రంలో కార్యకర్తల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం శక్తివంతమైన దేశంగా ఎదిగి అభివృద్ధి చెందిన దేశాల సరసాన నిలుస్తుందన్నారు. సెప్టెంబర్ 17ను విమోచన దినంగానే పాటిస్తామని ఆమె వివరించారు. నవాబుపేటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా 128 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు భోజనం ప్యాకెట్ల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ కార్యాలయ ఆవరణలో ఎంపీ డీకే అరుణ చేతుల మీదుగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పార్టీ నాయకుడు దర్పల్లి హరికృష్ణ భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



నవాబుపేట: యూరియా కోసం రైతుల బారులు వరుసగా కొనసాగుతూనే ఉన్నాయి. నిరీక్షించిన రైతులు యూరియా వచ్చిందని తెలియగానే వేల సంఖ్యలో క్యూ కట్టారు. బుధవారం మండల కేంద్రంలో యూరియా రావటంతో రైతు వేదిక వద్ద క్యూ కట్టారు. ఎండ వేడిమిని తట్టుకోలేక చెట్ల కొమ్మలు విరిచి తలపై పెట్టుకొని ఎండ నుంచి ఉపశమనం పొందుతూ గంటల తరబడి నిరీక్షించారు.

20న ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ట్రస్మా సంఘం ఆధ్వర్యంలో 20న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్నట్లు ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలి రావాలని, వారితో పాటు ఎ స్సెస్సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కూడా సన్మానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పీయూ స్నాతకోత్సవానికి ఆహ్వానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అక్టోబర్ 16న నిర్వహించే 4వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మన్నె సత్యనారాయణ రెడ్డిని (ఎంఎస్‌ఎన్‌రెడ్డి) హాజరవుతారని, పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు ఆహ్వాన పత్రిక హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఇందుకు స్పందించి ఎంఎస్‌ఎన్‌రెడ్డి స్నాతకోత్సవానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

అడ్డాకులలో కంటి వైద్య శిబిరం



అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్థనారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా కంటి వైద్యురాలు సౌమ్య 77 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు మదస్సిర్ హుస్సేన్, సీహెచ్ఓ షబ్బీర్ హుస్సేన్ ఉన్నారు.

బాలికల సంరక్షణపై శిక్షణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మోడల్‌బేసిక్ స్కూల్‌లో బాలికల సంరక్షణపై ఉపాధ్యాయులకు ప్రజ్వల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను దేశ భవిష్యత్ నిర్ణయించే స్థాయికి తీర్చిదిద్దాలని, అందు కోసం ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. మొబైల్‌లో జరిగే సైబర్ ట్రాఫికింగ్ నేరపూరితమైందని, మొబైల్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు ఏదైనా ప్రమాదం అనిపిస్తే 1098, 100,181 నెంబర్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, బాసిత్, ఏఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్, మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి, చక్రాపూర్ గ్రామాలకు చెందిన బాధితులను బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. పొన్నకల్‌లో అనంతమ్మ చనిపోవడంతో ఆమె భర్త నర్సింహారెడ్డిని, చక్రాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు బాలన్న అనారోగ్యానికి గురికావడంతో ఆయనను, కొమిరెడ్డిపల్లిలో శేఖర్ తల్లి మృతి చెందడంతో ఆయనను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, మహిమూద్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ, విజయకుమార్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్‌లైన్ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని పోలీస్‌లైన్ పాఠశాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోకి విషసర్పాలు, పందులు వస్తున్నాయని, విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాత క్వార్టర్స్ తొలగించాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ఆయన వెంట సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, కృష్ణముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు ఖాజాపాషా, అంజద్, రాషెద్‌ఖాన్, హెచ్‌ఎం సాజిద్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ.వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ కబడ్డీ బాల, బాలికల కోచింగ్ క్యాంప్‌ను బుధవారం ఎన్‌పీ వెంకటేశ్ సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటవుతున్నట్లు తెలిపారు. కబడ్డీలో జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఇసుక డంపులు సీజ్

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్ గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో, కౌకుంట్ల మండలం తిర్మలాపురం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను అధికారులు బుధవారం సీజ్ చేశారు. గ్రామాలకు చెందిన కొందరు అక్రమార్కులు ఇసుకను అక్కమంగా తరలించి వ్యవసాయ పొలంలో డంపు చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు ఇసుక డంపులను సీజజ్ చేశారు. మద్దూర్ గ్రామంలో సర్వేనంబర్ 72లోని వ్యవసాయ భూమిలో ఉన్న అక్రమ ఇసుక డంపులను చిన్నచింతకుంట తహసీల్దార్ ఎల్లయ, ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్, ఆర్ఐ తిరుపతయ్యలు పరిశీలించారు. 15 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఆ ఇసుకను గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. తిర్మలాపురం వ్యవసాయ పొలంలోని ఇసుక డంపులను కౌకుంట్ల మండల ఆర్ఐ, సిబ్బంది పరిశీలించారు. 10 ట్రాక్టర్ల ఇసుక ఇన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఆ ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సుందర్‌రాజు తెలిపారు.

రెండు గ్రామాల మధ్య ఇసుక వివాదం

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి, అమ్మపూరం గ్రామాల మధ్య ఇసుక వివాదం రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తమ గ్రామ ట్రాక్టర్లే ఇసుకను తరలించాలంటూ రెండు గ్రామాల ట్రాక్టర్ యజమానులు, గ్రామ నాయకులు బీష్మించారు. పలుమార్లు పంచాయితీ చేసినా కొలిక్కి రాలేదు.

లబ్ధిదారుల ఆందోళన..

ఇందిర్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కావాలని అమ్మపురం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చేశారు. బుధవారం చిన్నచింతకుంట తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. తహసీల్దార్ ఎల్లయ్య, ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ కురుమూర్తి గ్రామానికి చేరుకొని రెండు గ్రామాల ట్రాక్టర్ యజమానులు, గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులకు నచ్చజెప్పారు. గ్రామస్తులు ట్రాక్టర్ల ద్వారా కాకుండా ఎడ్ల బండ్లతో ఇసుకను తరలించుకోవాలని అధికారులకు తెలిపారు.

నిరంకుశ పాలనకు చరమగీతం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎంతో మంది తెగించి పోరాటం చేసిన ఫలితంగానే నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడారని బీఆర్‌ఎస్ నాయకులు అభిప్రాయ పడ్డారు. సెప్టెంబర్17న జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా బుధవారం ఆ పార్టీ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తమ పార్టీ జాతీయ సమైక్యత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌గణేష్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, గిరిధర్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, రామలింగం, సత్యంయాదవ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ. రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.కురుమూర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు కిల్లె గోపాల్, దీప్లానాయక్, వేణుగోపాల్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, హన్మంతు, భగవంతు, రాములు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు నడుం బిగించాలి



నవాబుపేట: సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో అందరు పాల్గొని ప్రతి మహిళను చదివించేలా చేయాలని వెలుగు ఏపీఎం శ్రీహరి సూచించారు. బుధవారం మహిళా సంఘాలకు సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. అనంతరం వారికి అక్షర వికాసం పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో గ్రామాల సీసీ రమాదేవి, కాంచన, బాల్‌రాజ్ పాల్గొన్నారు.